సమావేశానికి తరలిన నేతలు

జగద్గిరిగుట్ట: వడ్డెర కులస్తులు ఎస్టీ సాధన కోసం నగరంలో నిర్వహిస్తున్న సమావేశానికి దూలపల్లి, కొంపల్లి నుంచి సంఘం జిల్లా గౌరవ అధ్యక్షుడు శివరాత్రి బాలయ్య ఆధ్వర్యంలో ఆదివారం తరలివెళ్లారు. సుందరయ్య విజ్ఞాన కేంద్రంలో కార్యక్రమం జరిగింది. ఎన్నో సంవత్సరాల నుంచి ప్రభుత్వ పథకాలు అందడం లేదని, ఎస్టీ సాధన కోసం అందరం కలిసికట్టుగా పోరాడుతామని అన్నారు. కార్యక్రమంలో దుండిగల్ మండల అధ్యక్షుడు వల్లపు తిరుపతి, కృష్ణంరాజు, మల్లేష్, శివరాత్రి కుమార్ తదితరులు పాల్గొన్నారు.

ప్రమాదకరంగా మ్యాన్‌హోల్ !



సుభాష్‌నగర్: జీడిమెట్ల డివిజన్ అంగడిపేట్ ప్రధాన దారిలో ఓ మ్యాన్‌హోల్ నోరు తెరుచుకుంది. పైకప్పు శిథిలమవ్వడంతో ప్రమాదకరంగా ఉన్న మ్యాన్ హోల్ వద్ద ప్రమాదాలు జరగకుండా స్థానికులు గుర్తును ఏర్పాటు చేశారు. సంబంధిత అధికారులు దృష్టి సారించి మ్యాన్‌హోల్ పైకప్పును అమర్చాలని కోరుతున్నారు.

మార్షల్ ఆర్ట్స్‌తో శారీరక దారుఢ్యం

చింతల్: మార్షల్ ఆర్ట్స్‌తో ఆత్మరక్షణతో పాటు శారీరక దారుఢ్యం పెంపొందుతుందని కార్పొరేటర్ విజయశేఖర్‌గౌడ్ అన్నారు. చింతల్ డివిజన్ వైఎంఎస్ కాలనీలో విక్టరీ మార్షల్ ఆర్ట్స్ అకాడమీని ఆదివారం మాజీ మున్సిపల్ వైస్ చైర్మన్ తుంగ లక్ష్మారెడ్డితో కలిసి ప్రారంభించారు. కార్యక్రమంలో డేగల కృష్ణమూర్తి, భగత్‌సింగ్ నగర్ సంక్షేమ సంఘం అధ్యక్ష, కార్యదర్శులు కొండల శ్రీనాథ్‌రావు, సత్యం, కరాటే మాస్టర్ కావలి ఎల్లేష్‌గౌడ్, వెంకటేశం గౌడ్ పాల్గొన్నారు.

సలీమ్ సేవలు మరువలేం

కుత్బుల్లాపూర్: సీపీఎం గాజులరామారం డివిజన్ శాఖ మాజీ కార్యదర్శి సలీమ్ ఈ ప్రాంత ప్రజలకు చేసిన సేవలు మరువలేం అని ఆ పార్టీ మండల కార్యదర్శి లక్ష్మణ్ అన్నారు. ఆదివారం రోడా మేస్త్రినగర్‌లోని భగత్‌సింగ్ విగ్రహం వద్ద సంతాపసభ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. 1988 నుంచి కుత్బుల్లాపూర్ ప్రాంతంలో పార్టీ బలోపేతానికి కృషి చేశారన్నారు. అనంతరం సీపీఎం జిల్లా కమిటీ సభ్యుడు బొడిగె లింగస్వామి మాట్లాడుతూ.. ప్రజా సమస్యల పరిష్కారం, పేదలకు ఇళ్లస్థలాల కోసం లాఠీ దెబ్బలు సైతం లెక్క చేయకుండా పోరాటం చేశారని అన్నారు. ఆయన కుటుంబానికి పార్టీ అండదండలు ఎప్పుడూ ఉంటాయన్నారు. సలీమ్ పోరాట స్ఫూర్తిని కొనసాగిస్తామన్నారు. కార్యక్రమంలో మండల కమిటీ సభ్యులు సత్యం, అంజయ్య, స్వాతి, జాకీర్ హుస్సేన్, ఆరీఫ్, శంకర్, రమణ, లక్ష్మి, లక్ష్మణరావు, ఖలీల్ తదితరులు పాల్గొన్నారు

కాలనీల్లో వసతులు కల్పించడమే లక్ష్యం

కార్పొరేటర్ సత్యనారాయణ



సీసీ రోడ్డు పనులు ప్రారంభిస్తున్న కార్పొరేటర్ సత్యనారాయణ

సుభాష్‌నగర్: ఆయా కాలనీల్లో వసతులు కల్పించడమే లక్ష్యమని కార్పొరేటర్ సత్యనారాయణ అన్నారు. సూరారం డివిజన్ టీఎస్ఐఐసీ కాలనీలో రూ. 50 లక్షల వ్యయంతో సీసీ రోడ్డు పనులను ఆదివారం స్థానికులతో కలిసి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. పనులను త్వరితగతిన పూర్తి చేసి అందుబాటులోకి తీసుకువస్తామని తెలిపారు. డివిజన్‌లో సీసీ రోడ్లు లేని ప్రాంతాలను గుర్తించామని, దశలవారీగా రోడ్డు సౌకర్యం కల్పిస్తామన్నారు. టీఎస్ఐఐసీ కాలనీ ప్రెసిడెంట్ రాజు, ఎల్లైట్ కౌంటీ ప్రెసిడెంట్ సిద్దిక్, చెక్క సురేష్, గిరిధర్ తదితరులు పాల్గొన్నారు.

డ్రంకన్ డ్రైవ్‌లో పట్టుబడ్డ 56 మంది వాహనదారులు

కుత్బుల్లాపూర్: సైబరాబాద్ కమిషనరేట్ పరిధిలోని మేడ్చల్ ట్రాఫిక్ డీసీపీ పరిధిలో నిర్వహించిన డ్రంకన్ డ్రైవ్‌లో 56 మంది వాహనదారులు పట్టుబడ్డారు. శుక్ర, శనివారాల్లో నిర్వహించిన స్పెషల్ డ్రైవ్‌లో బాలానగర్ ట్రాఫిక్ పీఎస్ పరిధిలో 15 మంది, జీడిమెట్ల పరిధిలో 11 మంది, అల్వాల్ ట్రాఫిక్ పీఎస్ పరిధిలో 22 మంది, మేడ్చల్ పీఎస్ పరిధిలో 18 మంది వాహనదారులు పట్టుబడగా.. వారి వాహనాలను సీజ్ చేసి కేసు నమోదు చేశారు.

నేటి నుంచి నూతన కార్డులకు రేషన్!

- 5165 రేషన్ కార్డులు మంజూరు
- బియ్యం పంపిణీకి ఏర్పాట్లు పూర్తి చేసిన అధికారులు



జగద్గిరిగుట్ట: ఎన్నో ఏళ్ల నుంచి ఎదురుచూస్తున్న అవకాశం ఎట్టకేలకు వచ్చింది. తమకు రేషన్ కార్డు కావాలని ఎన్నో పర్యాయాలు దరఖాస్తు చేసుకున్నా ఎనిమిది సంవత్సరాలుగా ఇబ్బందులు పడుతున్న వారికి ప్రభుత్వం శుభవార్త తెలిపింది. ఇప్పటికే దరఖాస్తు చేసుకున్న వారిని క్షేత్రస్థాయిలో పరిశీలించి తుది జాబితాను విడుదల చేసి సెప్టెంబర్ ఒకటో తేదీ నుంచి సన్న బియ్యం పంపిణీ చేసేందుకు రంగం సిద్ధం చేశారు. కుత్బుల్లాపూర్ గాజులరామారం జంట సర్కిళ్ల పరిధితో పాటు దుండిగల్, బాచుపల్లి మండల పరిధిలో ఈ ప్రక్రియ పూర్తి చేసి పంపిణీకి రంగం సిద్ధం చేశారు. నియోజకవర్గ వ్యాప్తంగా మొత్తం 12 వేలకు పైగా దరఖాస్తులు రాగా.. వాటిలో 1835 దరఖాస్తులను తిరస్కరణ చేసి... 5165 దరఖాస్తులను ఆమోదించారు. వారికి కొత్త రేషన్ కార్డు అందజేయడమే కాకుండా సెప్టెంబర్ నుంచి సన్న బియ్యం పంపిణీ చేయనున్నారు. ఇప్పటికే పౌరసరఫరాల శాఖ అధికారులు ఆయా రేషన్ షాపుల వద్ద కొత్తగా కార్డులు పొందిన వారి జాబితాను అందజేశారు.

ఎన్నో పథకాలకు ..

ఆరోగ్యశ్రీ తో పాటు గృహ లక్ష్మి, 200 యూనిట్ల ఉచిత కరెంటు, గ్యాస్ సిలిండర్ సబ్సిడీ, ఫీజు రియింబర్స్‌మెంట్ తదితర వాటికి రేషన్ కార్డు ప్రధానం. ఈ నేపథ్యంలో ప్రజలు రేషన్ కార్డు కోసం పౌరసరఫరాల శాఖ కార్యాలయం చుట్టూ తిరగాల్సిన పరిస్థితి ఏర్పడింది. అయితే ప్రజా పాలన పేరుతో కాంగ్రెస్ ప్రభుత్వం సమావేశాలు నిర్వహించి దరఖాస్తులు తీసుకోగా ..వాటిని అధికారులు జల్లెడ పట్టి అర్హులైన పేదలకు రేషన్ కార్డు అందే విధంగా చర్యలు చేపట్టారు. దీంతో 5165 కార్డులు కొత్తగా మంజూరు అయ్యాయి. వీరికి నియోజకవర్గ పరిధిలో ఉన్న ఏ రేషన్ దుకాణంలోనైనా కార్డును ఉపయోగించి రేషన్ తీసుకోవచ్చు.

నేటి నుంచే సన్న బియ్యం పంపిణీ

నియోజకవర్గంలో ఇప్పటికే పాత రేషన్ కార్డులు 1.25 లక్షలు ఉండగా.. మొత్తం 115 రేషన్ దుకాణాల్లో వీరికి సన్న బియ్యం సరఫరా చేస్తూ వస్తున్నారు.. తాజాగా 5165 కార్డులు రావడంతో వాటిని సైతం ఆయా రేషన్ దుకాణాలకు అటాచ్ చేశారు. అయితే ఇప్పటికే పాత కార్డుదారులకు జూన్, జూలై, ఆగస్టు కోటా ద్వారా మూడు నెలల సన్నబియ్యాన్ని పంపిణీ ప్రక్రియ పూర్తి చేయగా.. తాజాగా కొత్త కార్డులు పొందిన వారికి అవకాశం కల్పిస్తూ ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసిన విషయం తెలిసిందే. ఆగస్టు 20 వరకు కొత్త కార్డుల ఎంపిక ప్రక్రియకు కసరత్తు చేసిన అధికారులు ఎట్టకేలకు తుది జాబితా విడుదల చేసి పంపిణీకి సిద్ధం చేశారు.

ఏర్పాట్లు పూర్తి

నూతనంగా రేషన్ కార్డు వచ్చిన వారికి సన్నబియ్యం పంపిణీ చేసేందుకు ఏర్పాట్లు పూర్తయ్యాయి. అర్హులైన ప్రతి ఒక్కరూ ఎప్పుడైనా దరఖాస్తు చేసుకోవచ్చు. ఆందోళన చెందాల్సిన అవసరం లేదు. ఇది ప్రభుత్వం కల్పించిన అవకాశం. రేషన్ కార్డుల దరఖాస్తు ప్రక్రియ నిరంతర ప్రక్రియ. వచ్చిన ప్రతి దరఖాస్తులను పరిశీలించిన తర్వాత అర్హులైన వారికి తప్పక అవకాశం కల్పిస్తాం.

- కల్యాణ, బాలానగర్ ఏఎస్ఓ

రాహుల్‌గాంధీ క్షమాపణ చెప్పాలి

జీడిమెట్ల: బిహార్ ఎన్నికల ప్రచారంలో కాంగ్రెస్ ఎంపీ రాహుల్‌గాంధీ ప్రధాని తల్లిపై చేసిన అనుచిత వ్యాఖ్యలకు నిరసనగా బీజేపీ నాయకులు రాహుల్ గాంధీ దిష్టిబొమ్మను దహనం చేశారు. ఆదివారం బీజేపీ నాయకులు ఎం.ఎస్.వాసు ఆధ్వర్యంలో సుభాష్‌నగర్‌లో రాహుల్‌గాంధీకి వ్యతిరేకంగా నినాదాలు చేశారు. రాహుల్‌గాంధీ వెంటనే క్షమాపణ చెప్పాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో డివిజన్ అధ్యక్షులు విజయేందర్‌రెడ్డి, కల్యాణి, జిల్లా కార్యవర్గ సభ్యులు సత్తిబాబు, విఘ్నేష్, వెంకటరత్నం, సురేష్‌నాయుడు, దిలీప్‌రెడ్డి, లక్కిరెడ్డి, కిరణ్‌పాల్, మోహన్ తదితరులు పాల్గొన్నారు.

అనుచిత వ్యాఖ్యలు తగవు...

దుండిగల్: కాంగ్రెస్ నేత రాహుల్‌గాంధీ హద్దులు దాటి మాట్లాడుతున్నారని, ప్రధాని మాతృమూర్తిపై అనుచిత వ్యాఖ్యలు చేయడాన్ని దేశ ప్రజలు ముక్తకంఠంతో ఖండిస్తున్నారని బీజేపీ దుండిగల్ మున్సిపల్ అధ్యక్షుడు పీసరి కృష్ణారెడ్డి అన్నారు. ఆదివారం దుండిగల్ బీజేపీ ఆధ్వర్యంలో గండిమైసమ్మ చౌరస్తాలో నిరసన వ్యక్తం చేశారు. చిల్లర మాటలు మానుకోకుంటే గుణపాఠం తప్పదన్నారు.



సుభాష్‌నగర్‌లో రాహుల్‌గాంధీ దిష్టిబొమ్మను దహనం చేస్తున్న నాయకులు

సుభాష్‌నగర్: రాహుల్‌గాంధీ నీచరాజకీయాలకు మానుకోవాలని బీజేపీ నాయకుడు కంది శ్రీరాములు అన్నారు. రాహుల్ గాంధీ వ్యాఖ్యలను నిరసిస్తూ సూరారం కాలనీ ఓం జెండా కూడలి వద్ద ఆయన దిష్టిబొమ్మను దహనం చేశారు. కార్యక్రమంలో బీజేపీ నాయకులు భీమరాజు, మారి గణేష్, అంగిడి మల్లేష్, బైండ్ల రాము, మంద మహేష్, హరి వర్ధన్, విజయ్, కోదండ, సుధాకర్, శ్రీనివాస్, సురేందర్ తదితరులు పాల్గొన్నారు.



గండిమైసమ్మ చౌరస్తాలో రాహుల్ గాంధీ దిష్టిబొమ్మను దహనం చేస్తున్న నాయకులు



సూరారం కాలనీలో దిష్టిబొమ్మ దహనం చేస్తున్న నాయకులు

ఆసుపత్రికి తరలించిన పోలీసులకు సన్మానం

జీడిమెట్ల: రోడ్డు ప్రమాదం జరగగానే క్షణాల్లో ఆసుపత్రికి తరలించి మెరుగైన వైద్యం అందేలా కృషి చేసిన జీడిమెట్ల పోలీసులను బాధితులు సన్మానించారు. జూన్ 28న భానుకిరణ్(22), శివ(19) కళాశాలకు వెళ్లేందుకు గాజులరామారం నుంచి ఐడీపీఎల్ వైపు ద్విచక్రవాహనంపై వెళ్తున్నారు. వీరు ప్రయాణిస్తున్న ద్విచక్రవాహనం జీడిమెట్ల పీఎస్ వద్ద మలుపు తీసుకుంటున్న ఆర్టీసీ బస్సుకు ఢీ కొట్టింది అక్కడే ఉన్న జీడిమెట్ల పోలీసులు క్షణాల్లో ప్రమాదం జరిగిన చోటుకు పరుగులు తీశారు. ఇద్దరు యువకులను వెంటనే దగ్గరలోని ఓ ప్రైవేట్ ఆసుపత్రికి తరలించారు. చికిత్స అనంతరం రెండు నెలల తర్వాత వారికి పోలీసులు చేసిన సహాయాన్ని మరువక ఆదివారం జీడిమెట్ల పీఎస్‌లో ఇన్‌స్పెక్టర్ మల్లేష్‌తో పాటు జీడిమెట్ల పోలీసులను సన్మానించారు.



ఇన్‌స్పెక్టర్ మల్లేష్‌ను సన్మానిస్తున్న బాధితులు

వైద్య విద్యార్థినికి ఆర్థికసాయం

జీడిమెట్ల: చదువుకునే విద్యార్థులకు ఆర్థిక సహాయం చేయడం సంతోషంగా ఉందని విద్యుత్‌శాఖ అసిస్టెంట్ ఇంజినీర్ వై.అనూష అన్నారు. కరీంనగర్‌లో చదువుతున్న వైద్య విద్యార్థిని సునీతకు చదువు నిమిత్తం డబ్బు అవసరం ఉందని హార్ట్ టూ హెల్ప్ చారిటీ ద్వారా అనూష తెలుసుకున్నారు. ఆదివారం ఆమె తన పుట్టినరోజును పురస్కరించుకుని సునీతకు రూ.20 వేల చెక్కును అందజేశారు. కార్యక్రమంలో క్రాంతి, రవినాయక్ తదితరులు పాల్గొన్నారు.



మన్ కీ బాత్ కార్యక్రమాన్ని వీక్షించిన నేతలు

కుత్బుల్లాపూర్: దేశ ప్రజలను ఉద్దేశించి భారత ప్రధాని నరేంద్ర మోదీ మాట్లాడే మన్ కీ బాత్ కార్యక్రమం 125 ఎపిసోడ్‌ను ఆదివారం కొంపల్లి బీజేపీ నాయకులు వీక్షించారు. క్రీడా రంగంలో కీలక ప్రయోగాలు, మారుమూల ప్రాంతాల క్రీడాకారులకు ప్రోత్సాహం, వోకల్ ఫర్ లోకల్ (స్వదేశీ ఉత్పత్తుల ప్రోత్సాహం), ప్రకృతి విపత్తుల సమయంలో సహనం, విపత్తు నిర్వహణ చర్యలు, గణేష్ ఉత్సవాలు, తెలంగాణ విమోచన దినోత్సవం (ఆపరేషన్ పోలో) గురించి ప్రధాని క్లుప్తంగా వివరించినట్లు కొంపల్లి బీజేపీ అధ్యక్షుడు పెద్దబుద్దల సతీష్‌సాగర్ తెలిపారు. మన్‌కీ బాత్ కార్యక్రమంతో దేశ ప్రజలకు విలువైన సందేశాన్ని ఇచ్చారని పేర్కొన్నారు. మన్ కీ బాత్ కార్యక్రమాన్ని వీక్షించిన వారిలో మేడ్చల్ జిల్లా ఉపాధ్యక్షుడు రాజిరెడ్డి, బీజేపీ రాష్ట్ర మహిళా మోర్చా అధికార ప్రతినిధి సరిత రావు, జిల్లా కౌన్సిల్ సభ్యులు జనార్దన్ రెడ్డి, అసెంబ్లీ కో కన్వీనర్ శివాజీ రాజు. కొంపల్లి పట్టణ ప్రధాన కార్యదర్శి మధు, కోశాధికారి ఉప్పరి మహేందర్, కార్యదర్శి మురళీకృష్ణ తదితరులు ఉన్నారు.

దుండిగల్: ప్రధాని నిర్వహించిన మన్ కి బాత్ కార్యక్రమాన్ని దుండిగల్ మున్సిపల్ బీజేపీ కార్యాలయంలో ఆదివారం బీజేపీ నాయకులు వీక్షించారు. కార్యక్రమంలో మున్సిపల్ ప్రధాన కార్యదర్శులు తురాయి భాను గౌడ్, దమ్మగారి సీతారామ్‌రెడ్డి, మాజీ కౌన్సిలర్ ఆంజనేయులు, ఉపాధ్యక్షురాలు రోజ, కోశాధికారి ప్రశాంత్, సీనియర్ నాయకులు ప్రభాకర్ రెడ్డి, నర్సింహా చారి, యశ్వంత్ రెడ్డి పాల్గొన్నారు.



మన్‌కీ బాత్ కార్యక్రమాన్ని వీక్షిస్తున్న బీజేపీ నాయకులు



మన్‌కీ బాత్ కార్యక్రమాన్ని వీక్షిస్తున్న కొంపల్లి బీజేపీ నాయకులు



జీడిమెట్ల డివిజన్ వైష్ణవి ఎన్‌క్లేవ్‌లో అన్నదానం నిర్వహిస్తున్న కాలనీ అసోసియేషన్ సభ్యులు



పూజలో పాల్గొన్న మాజీ ఎమ్మెల్యే కూన శ్రీశైలంగౌడ్



నిజాంపేట్‌లో పాల్గొన్న మాజీ కార్పొరేటర్ ప్రణయ్‌ధన్‌రాజ్‌యాదవ్



శివనగర్‌లో అన్నదాన కార్యక్రమంలో పాల్గొన్న బీజేపీ అసెంబ్లీ కన్వీనర్ జేకే శేఖర్‌యాదవ్



బాచుపల్లిలో పూజలో కాసాని వీరేశ్, కాలనీవాసులు



చింతల్ శ్రీవిద్యా జూనియర్ కళాశాలలో..



మల్లంపేట్‌లో గణనాథుడి పూజలో మహిళలు



దూలపల్లిలో అన్నదానం నిర్వహిస్తూ..



సూరారం కాలనీలో గణేశ్ మండపంలో..



మిథిలా నగర్‌లో లడ్డూను సొంతం చేసుకున్న వెంకట రవీంద్ర

అన్నదానాలు.. పూజలు

వైభవంగా వినాయకుడి నవరాత్రి ఉత్సవాలు

గణేశ్ ఉత్సవాల నేపథ్యంలో ఆదివారం నియోజకవర్గ వ్యాప్తంగా ఏర్పాటు చేసిన మండపాల వద్ద పెద్ద ఎత్తున అన్నదానాలు జరిగాయి. సంక్షేమ సంఘాలు, యువజన సంఘాల ఆధ్వర్యంలో గణనాథులకు ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఊరేగింపుగా నిమజ్జనాలకు తరలించారు. అన్నదాన కార్యక్రమాల్లో పెద్ద సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు. నిమజ్జనం సందర్భంగా పలు ప్రాంతాల్లో లడ్డూ వేలంపాటలో భక్తులు పోటీపడ్డారు. -కుత్బుల్లాపూర్



నిజాంపేట్ వెంకట్రాయనగర్‌లో పూజలు చేస్తున్న భక్తులు



వెన్నెలగడ్డలో ఉట్టి కొడుతున్న చిన్నారులు



షాపూర్‌లోని సంజయ్‌గాంధీ నగర్‌లో..





నిజాంపేట్ పరిధి జీఎల్ఆర్ కాలనీలోని జాగృతి రెసిడెన్సిలో వినాయకుడి లడ్డూను రూ. 1.80 లక్షలకు కైవసం చేసుకున్న సతీష్ దంపతులు, చిన్న లడ్డూను కైవసం చేసుకున్న చిన్నారి శ్రీకృతి